# హైదరాబాద్‌లో 77వ ఇండియన్ రోడ్ కాంగ్రెస్

- డిసెంబరు 15 నుంచి 18 వరకు సదస్సు
- ప్రారంభించనున్న సీఎం కేసీఆర్, కేంద్రమంత్రి గడ్కరీ
- అధికారులతో మంత్రి తుమ్మల సమీక్ష

కూసుమంచి/హైదరాబాద్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో '77వ ఇండియన్ రోడ్ కాంగ్రెస్ సదస్సు'ను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్నట్లు రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. నగరంలోని హైటెక్స్‌లో డిసెంబర్ 15 నుంచి 18 వరకు జరిగే ఈ సదస్సుకు 5000 మంది ప్రతినిధులు వస్తారని చెప్పారు. సదస్సుని సీఎం కేసీఆర్, కేంద్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కారీ ప్రారంభిస్తారని వెల్లడించారు. శుక్రవారం సచివాలయంలో రహదారులు, వంతెనల నిర్మాణంలో పురోగతి, రోడ్ కాంగ్రెస్ సదస్సుపై తుమ్మల సమీక్ష నిర్వహి ంచారు. ఈ సదస్సు వల్ల జాతీయ, అంతర్జాతీయంగా చేపడుతున్న నూతన రహదారులపై, సాంకేతికతపై రాష్ట్ర ఇంజనీర్లకు అవగాహన కలుగుతుందన్నారు. రహదారులపై ప్రమాదాల నివారణ, ఇంటెలిజెంట్ రవాణా వ్యవస్థలు, ట్రాఫిక్ నిబంధనల వంటి విషయాలపై సదస్సు జరుగుతుందన్నారు. అలాగే ప్రభుత్వం పరిపాలనా అనుమతి ఇచ్చిన 389 వంతెనల నిర్మాణ పురోగతిని మంత్రి సమీక్షించారు. వంతెనల నిర్మాణాలను త్వరగా పూర్తిచేయాలని, ఆలేరులో వంతెనను ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలన్నారు. వంతెనలు, ఆర్‌వోబీల నిర్మాణానికి నిధులు పెంచాలని సీఎం కేసీఆర్‌ను కోరతామన్నారు. నాబార్డు సహకారంతో చేపట్టిన గ్రామీణ రోడ్లు త్వరగా పూర్తయ్యేలా చూడాలని చెప్పారు. హైదరాబాద్ పరిధిలో హైవేలు, మెట్రోరైల్ ప్రాంతాల్లో దెబ్బతిన్న రోడ్ల విషయంపై నగరపాలక సంస్థ, మెట్రోరైల్ అధికారులతో సమావేశమై, మరమ్మతులు చేపట్టాలన్నారు. సమావేశంలో ఆర్ అండ్ బీ ముఖ్య కార్యదర్శి సునీల్ శర్మ, ఈఎన్‌సీలు గణపతిరెడ్డి, భిక్షపతి, రవీందర్‌రావు, చీఫ్ ఇంజనీర్ మహేందర్ పాల్గొన్నారు. కాగా, రాష్ట్రంలో ప్రధాన పుణ్యక్షేత్రాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి తుమ్మల చెప్పారు. శుక్రవారం ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం నాయకన్‌గూడెంలో శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో టీటీడీ ద్వారా మంజూరైన రూ. 23 లక్షలతో పునర్నిర్మాణ పనులను టీటీడీ పాలకవర్గ సభ్యుడు, సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్యతో కలిసి మంత్రి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. భద్రాచలానికి వెళ్లే రహదారులన్నింటినీ జాతీయ రహదారులుగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. టీటీడీ నుంచి జిల్లాలో ఆలయాల పునర్నిర్మాణానికి ఎక్కువ నిధులు వచ్చేలా చూడాలని సండ్రను కోరారు. భద్రాచలం, జమలాపురం, అన్నపురెడ్డిపల్లి ఆలయాల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. కూసుమంచిలోని పురాతన శివాలయ అభివృద్ధికి ఆర్కియాలజీ అధికారులతో ప్రతిపాదనలు తయారు చేయిస్తామన్నారు. వెంకటవీరయ్య మాట్లాడుతూ... రెండు రాష్ట్రాలుగా విడిపోయినా తిరుమల ఇరు ప్రాంతాలకు ఆధ్యాత్మిక కేంద్రంగా భాసిల్లుతోందని అన్నారు.



ఖమ్మం జిల్లా నాయకన్‌గూడెంలో ఆలయ పునర్నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న మంత్రి తుమ్మల

ఆంధ్రజ్యోతి Sat, 15 October 2016
epaper.andhrajyothy.com/c/13916363